పెండింగ్ బీటీ రోడ్డు పనుల పై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

- ఏళ్ల తరబడి పనులు చేపట్టని కాంట్రాక్టర్లపై చర్యలకు ఎమ్మెల్యే మదన్‌మోహన్ విజ్ఞప్తి.
- సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నిధులతో మంజూరైన పనులపై సమీక్ష.
- కాంట్రాక్టును రద్దు చేసి రీ-టెండరింగ్ చేపట్టాలి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్.



తెహెల్కా

ప్రతి వార్త సంచలనం





నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం 4 నవంబర్ 2026 పేజీలు : 4

మేడిగడ్డ బ్యారేజీని సందర్శించిన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలు

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నేతృత్వంలో పర్యటన.
- గంప గోవర్ధన్ సహా పలువురు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతల హాజరు.
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో ఘన స్వాగతం.



కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని మంగళవారం సందర్శించారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నేతృత్వంలో పలువురు పార్టీ ముఖ్య నేతలు మేడిగడ్డకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ షిండే, జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తదితరులు పర్యటనలో పాల్గొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకున్న నాయకులకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి నేతలకు స్వాగతం పలికారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పలువురు ముఖ్య నాయకులు ఒకేసారి మేడిగడ్డను సందర్శించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి

- ఎల్‌నినో ప్రభావం, తగ్గుతున్న నీటి నిల్వలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి.
- వరికి ప్రత్యామ్నాయంగా యాసంగిలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి.
- బిందు సేద్యం, విత్తనాలపై ప్రభుత్వ రాయితీలు రైతులకు అందించాలి.
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.



కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో యాసంగి పంటల ప్రణాళిక, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో మెరుగైన దిగుబడి, ఆదాయం పొందగలిగే పంటల వైపు రైతులను మళ్లించాలని సూచించారు. - మిగతా2లో

నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో యాసంగి పంటల ప్రణాళిక, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో మెరుగైన దిగుబడి, ఆదాయం పొందగలిగే పంటల వైపు రైతులను మళ్లించాలని సూచించారు.

గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన

పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు, సూర్యకాంతి, వేరుశనగ, నువ్వులు వంటి నూనెగింజలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి చిరుధాన్యాలతో పాటు కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో రైతులకు మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. ఆయిల్‌పామ్, కూరగాయల వంటి ఉద్యాన పంటల సాగుతో తక్కువ నీటిని వినియోగిస్తూ మెరుగైన ఆదాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు.

రాయితీల వివరాలు ప్రతి రైతుకు చేరవేయాలి

బిందు సేద్య పరికరాలు, విత్తనాలపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అందించాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. సాగుభూముల సంరక్షణ కోసం అమలు చేస్తున్న 'భూమి బచావో అభియాన్'తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు, రాయితీల వివరాలను ప్రతి రైతుకు చేరవేయాలన్నారు. పశువులకు పశుగ్రాస కొరత ఏర్పడకుండా పశుగ్రాస పంటల సాగును ప్రోత్సహించాలని చెప్పారు. రైతు బీమా పరిహారం పొందడంలో కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలగకుండా మరణ ధ్రువీకరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు జాప్యం లేకుండా మంజూరు చేయాలని ఆదేశించారు.

నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి

తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకొని ఆర్థిక నష్టాలను నివారించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, డీఆర్‌డీఓ దామోదర్‌రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఏడీఏలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూదం జీవితాలను చిన్నాభిన్నం చేసే వ్యసనం

- పేకాట స్థావరాలపై ఉక్కుపాదం.. ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు
- 24 గంటల పాటు జూదం నిర్వాహకులపై నిరంతరం నిఘా..ఆకస్మిక దాడులు.
- జిల్లావ్యాప్తంగా పేకాట నిర్మూలనే లక్ష్యం, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం.
- జూదం కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం.
- జూదం ఆడినా.. నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవు.
- జూదానికి దూరంగా ఉండండి.. కుటుంబాలను కాపాడుకోండి.
- కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర



కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)

జూదం సంపాదనకు మార్గం కాదని, జీవితాలను చిన్నాభిన్నం చేసే వ్యసనమని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర సూచించారు. జిల్లాలో జూదం, పేకాట కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర వెల్లడించారు. ఈ బృందాలు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ జిల్లా వ్యాప్తంగా పేకాట స్థావరాలపై నిరంతర నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. జూదం కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు పెరిగి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

యువత భవిష్యత్తుపై ప్రభావం

యువత క్షణిక ఆనందాలకు, అత్యాశకు లోనై, పేకాటకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని ఎస్పీ పేర్కొన్నారు. జూదం కేసుల్లో పట్టుబడి కేసులు నమోదైతే పోలీసు రికార్డుల్లో వివరాలు నమోదవుతాయని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు జరిగే పోలీసు వెరిఫికేషన్‌లో గత కేసుల వివరాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఉద్యోగ అవకాశాల పై ప్రభావం పడవచ్చని హెచ్చరించారు. కేసుల దర్యాప్తులో చట్టప్రకారం వేలిముద్రలు సేకరించి పోలీసు రికార్డుల్లో భద్రపరిచే అవకాశం ఉంటుందని వివరించారు. క్షణికమైన ఆనందం కోసం జీవితకాల భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని హితవు పలికారు.

సమాచారాన్ని 8712686133 తెలుపాలి..

జిల్లాలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, నిర్వహిస్తున్నా ఉపేక్షించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జూద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినా, విశ్వసనీయ సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ 8712686133 నంబరుకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

పేకాట నిర్మూలనలో ప్రజలు సహకరించాలి

జూదం, పేకాట నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములై పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ కుటుంబాలకు, సమాజానికి మంచి భవిష్యత్తును అందించాలని సూచించారు. జూదానికి దూరంగా ఉండండి.. కుటుంబాలను కాపాడుకోండి.. యువత భవిష్యత్తును పదిలంగా ఉంచుకోండి అని పిలుపునిచ్చారు.

పెండింగ్ బీటీ రోడ్డు పనులపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) జగదీశ్వర్‌ను కలిసి పెండింగ్ పనులపై చర్చించారు. సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నిధులతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై, కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకుని నాలుగైదేళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు.

సంవత్సరాలు గడిచిన ప్రారంభంకాని రోడ్లు

నాగిరెడ్డిపేట మండలంలోని గొల్లలింగాల, రాఘవపల్లి, ఎర్రారం, ఆత్మకూరు, బొల్లారం మీదుగా జప్తి జానకంపల్లి రోడ్డు, తాండూర్-మసానిపల్లి, వాడి-చినూర్ రోడ్ల పనులను ప్రస్తావించారు.సదాశివనగర్ మండలంలోని ఉత్నూర్-తుక్కోజి వాడి-భూమ్‌పల్లి, జాతీయ రహదారి 44 నుంచి ధర్మారావుపేట మీదుగా అమర్లబండ రోడ్డు, ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల-తిమ్మారెడ్డి రోడ్డు నిర్మాణాలను చేపట్టాలని కోరారు. గాంధారి మండలంలో చాదుల్ తండా, పిస్కుల్ గుట్ట తండా, పెద్ద గుజ్జుల్ తండా, చిన్న గుజ్జుల్ తండా, లోంక తండా, దాపు తండా, బీర్మల్ తండాల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ

పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్ల అగ్రిమెంట్లను రద్దు చేసి, రీ-టెండరింగ్ ద్వారా కొత్త కాంట్రాక్టర్లను ఎంపిక చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు, విద్యార్థులు, ప్రయాణికుల రవాణా ఇబ్బందులు తొలగించేందుకు పెండింగ్ పనులన్నీ త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఎమ్మెల్యే వినతిపై స్పందించిన ఈఎన్‌సీ జగదీశ్వర్ పనుల అంశాన్ని పరిశీలించి త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్.



ఇందల్వాయి, నవంబర్ 3 (తెహెల్కా న్యూస్)

జల జీవన్ మరియు ఉమెన్ ఎంపవర్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 30 రోజుల కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎల్లారెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి సంధ్యతో కలిసి సర్పంచ్ సుజాత శేఖర్ ప్రారంభించారు. ఈ శిక్షణలో భాగంగా 30 మంది మహిళలు శిక్షణ తీసుకోవడం జరుగుతుందన్నారు. 30 రోజుల కుట్టు మిషన్ శిక్షణ అనంతరం సర్టిఫికేట్ కూడా ఇవ్వనున్నట్లు జలజీవన్ మరియు ఉమెన్ ఎంపవర్మెంట్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ శిక్షణ అనంతరం 50 శాతం సబ్సిడీలో కుట్టు మిషన్ లను పంపిణీ చేయడంతో పాటు మహిళలకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ కల్పనకు కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రైనరు సవిత, గ్రామ మహిళలు,పంచాయతీ పాలకవర్గం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన బాజిరెడ్డి జగన్



ఇందల్వాయి, నవంబర్ 3 (తెహల్కా న్యూస్)

ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి గ్రామంలో ఇటీవల అనారోగ్య రీత్యా మరణించిన వారి కుటుంబ సభ్యులను మంగళవారం టిఆర్ఎస్ నిజామాబాద్ రూరల్ ఇన్చార్జి బాజిరెడ్డి జగన్మోహన్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., రాబోయే ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యకర్తలందరు ఒక సంవత్సరం పాటు ఓపిక పట్టాలని హితవు పలికారు. ఇందల్వాయి గ్రామంలోని గొంగ గంగాధర్ తండ్రి గొంగ నడిపి గంగారం అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరపర్శించి పార్టీ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ఎడపల్లి నడిపి సాయిలు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ ఎంపిటిసి సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ లింగంపల్లి రాజేందర్, సింగిల్ విండో డైరెక్టర్ నామాల గంగాధర్, కుమ్మరి మోహన్, సుకూరు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా షబ్బీర్ అలీ.. రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

- వాడి గ్రామానికి చెందిన నర్సారెడ్డి కుటుంబానికి ఆర్థిక భరోసా.
- ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షలు మంజూరు.
- బాధిత కుటుంబానికి ఎల్ఓసీ అందజేసిన ప్రభుత్వ సలహాదారు.

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)



పేద, మధ్యతరగతి ప్రజలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ, వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు మహమ్మద్ అలీ షబ్బీర్ కృషి చేస్తున్నా రని ఆయన అనుచరులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా వాడి గ్రామానికి చెందిన ఎన్. పెద్ద నర్సారెడ్డి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.2.50 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. నర్సారెడ్డికి ఆపరేషన్ అవసరమని తెలుసుకున్న షబ్బీర్ అలీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా చొరవ తీసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2,50,000 విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని ఆయన నర్సారెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు .ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స చేయించుకోలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటు నందిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందేలా తనవంతు కృషి కొనసాగిస్తానని షబ్బీర్ అలీ భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందడంతో నర్సారెడ్డి కుటుంబ సభ్యులు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

దేశ సమగ్రత పై యువతలో అవగాహన కల్పించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- ఏక్తా దివస్ పరేడ్‌లో జిల్లా వాసులు పాల్గొనడం గర్వకారణం.
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)



జాతీయ ఐక్యతా వేడుకల్లో కామారెడ్డి బృందం

గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తా నగర్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా నిర్వహించిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి వేడుకలు, ఏక్తా దివస్ పరేడ్‌లో పాల్గొని తిరిగి వచ్చిన కామారెడ్డి జిల్లా బృందం మంగళవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ ఐక్యత, దేశ సమగ్రతను చాటిచెప్పే కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా నుంచి 19 మంది సభ్యుల బృందం పాల్గొనడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. దేశ ఐక్యత, సమైక్యత, దేశభక్తి భావాలను పెంపొందించే జాతీయ స్థాయి కార్యక్రమాల్లో జిల్లా వాసులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఏక్తా దివస్ పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా దేశ సమగ్రత, సాంస్కృతిక వైవిధ్యంపై మరింత అవగాహన కలుగుతుందన్నారు. దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన సేవలు, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత ఇటువంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

మున్సిపల్ అక్రమాల పై విచారణకు కలెక్టర్ ఆదేశం!

- నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్‌కు ఆదేశాలు.
- కామారెడ్డి మున్సిపల్ టెండర్లు, నియామకాలు, వేతనాల చెల్లింపులు, సీసీ కెమెరాలపై విచారణ.
- అక్రమ వసూళ్ల పై ఆధారాలతో ఫిర్యాదు చేయాలి, వివరాలు గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ హామీ.

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)



కామారెడ్డి మున్సిపాలిటీలో అక్రమ వసూళ్లు, పాలనాపరమైన అవకతవకలు జరుగుతున్నాయంటూ పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, నిర్దిష్ట గడువులోగా నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరిని ఆదేశించారు. మున్సిపాలిటీలోని వివిధ విభాగాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు, ప్రజలకు అందుతున్న సేవలకు సంబంధించిన అంశా లను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావాలని సూచించారు.

అన్ని విభాగాల పై విచారణ

మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ, పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు, వారి హాజరు నమోదు, వేతనాల చెల్లింపుల వివరాలను పరిశీలించనున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు పనుల్లో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యం ఉందన్న ఆరోపణలపైనా విచారణ జరపనున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం జారీ చేసిన నోటీసులు, వాటిపై అధికారులు తీసుకున్న తదుపరి చర్యలు, మున్సిపల్ కౌన్సిల్ నెలవారీ సమావేశాల నిర్వహణ తీరును పరిశీలించనున్నారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్ల కోసం కొనుగోలు చేసిన ఇనుప సామగ్రి వినియోగం, కార్యక్రమం అనంతరం వాటిని విక్రయించిన తీరు పై వివరాలు సేకరించనున్నారు.

వ్యాపార అనుమతుల పైనా ఆరా

మున్సిపల్ వాహనాల నెలవారీ ఇంధన వినియోగం, వ్యాపార అనుమతుల జారీ, ఇంటి పన్ను మదింపు ప్రక్రియ తదితర అంశాలనూ విచారణ పరిధిలోకి తీసుకున్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన రికార్డులు, లావాదేవీలు, అనుమతుల వివరాలను పరిశీలించి ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది నిర్ధారించనున్నారు.

ఆరోపణలు రుజువైతే బాధ్యుల పై కఠిన చర్యలు

మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందించే సేవల్లో అవకతవకలు, అక్రమ వసూళ్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పష్టం చేశారు. విచారణలో ఆరోపణలు రుజువైతే బాధ్యులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు

మున్సిపల్ సేవల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, ప్రజలను బెదిరింపులకు గురిచేసినా సంబంధిత ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కార్యాలయంలో లేదా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అందజేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మున్సిపల్ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బియ్యం దుకాణాల్లో అధికారుల తనిఖీలు, రెండు సంస్థల పై కేసులు





- ధరలు పెరగకుండా చర్యలు, కామారెడ్డి పట్టణంలో హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు.
- బియ్యం ప్యాకెట్లపై తయారీదారు చిరునామా, వినియోగదారుల సేవా సంబరు తప్పనిసరి.
- అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్ విక్టర్.

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)

కామారెడ్డి పట్టణంలోని పలు హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపార దుకాణాల్లో మంగళవారం పౌర సరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు బియ్యం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన రెండు వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేశారు. పట్టణంలో బియ్యం ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో బియ్యం ప్యాకెట్లను అధికారులు పరిశీలించారు. ప్యాకెట్లపై తయారీదారు చిరునామా, వినియోగదారుల సేవా కేంద్రం ఫోన్ నంబరు ముద్రించకపోవడాన్ని గుర్తించారు. ఇది నిబంధనలకు విరుద్ధమని నిర్ధారించి రెండు సంస్థలపై కేసులు నమోదు చేశారు.

కేసులు నమోదైన సంస్థలు:

1. జై సంతోషిమాత కిరాణా, సుభాష్ రోడ్, కామారెడ్డి.
2. లక్ష్మీ సాయి కిరాణా, జేపీఎన్ రోడ్, కామారెడ్డి.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ మాట్లాడుతూ., కామారెడ్డి పట్టణంలోని హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపారులు ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిర్ణయించిన గరిష్ఠ ధరలకు మించి విక్రయాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. నిర్ణీత ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు తనిఖీల్లో తేలితే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వం సూచించిన ధరలకే అమ్మాలి

ప్రభుత్వం సూచించిన ధరలకే అమ్మాలని సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన బియ్యం న్యాయమైన ధరలకు అందుబాటులో ఉండేలా వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బియ్యం ప్యాకెట్లపై తప్పనిసరిగా ముద్రించాల్సిన వివరాలను పొందుపరచడంతోపాటు, ప్రభుత్వ నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 14 ఫిర్యాదులు

- కామారెడ్డి టౌన్-2 సెక్షన్‌లో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక.
- సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు అధికారుల చర్యలు.

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)

విద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా స్వీకరించి సత్వర పరిష్కారం అందించేందుకు కామారెడ్డి టౌన్-2 సెక్షన్ పరిధిలో మంగళవారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్-2) నిర్వహించారు. కామారెడ్డి టౌన్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 14 ఫిర్యాదులు నమోదయ్యాయి. సీజీఆర్ఎఫ్-2 నిజామాబాద్ చైర్మన్ కె. కిషన్, సభ్యులు ఆర్. శేషారావు, టీజీఎన్ పీడీసీఎల్ సభ్యుడు (ఫైనాన్స్) పి. శ్రీనివాస్, నాలుగో సభ్యుడు కె. శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కామారెడ్డి టౌన్ సబ్ డివిజన్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.



వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సర్వీస్ కనెక్షన్లు, మీటర్ల పనితీరు, విద్యుత్ బిల్లులకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించి పరిశీలించారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. తాడ్వాయి నుంచి 3, కామారెడ్డి రూరల్ నుంచి 9, రాజంపేట నుంచి ఒకటి, రామారెడ్డి నుంచి ఒక ఫిర్యాదు వచ్చాయి.మొత్తం 14 ఫిర్యాదులు నమోదయ్యాయి. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను నేరుగా ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారం పొందేందుకు ఈ వేదిక దోహదపడుతుందని అధికారులు తెలిపారు.వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

సాగు భూములకు నీరు అందించాలని ప్రజావాణిలో ఫిర్యాదు

- ఇందల్వాయి చెరువులో నీరు పుష్కలం.
- గ్రామంలో పంటలు మాత్రం నిల్
- బీడు వారుతున్న సాగు భూములు.
- మంచినీటి కాలువలు లేక పంటలు పండటం లేదు

ఇందల్వాయి, నవంబర్ 3 (తెహెల్కా న్యూస్)



ఇందల్వాయి మండలంలోని అతి పెద్ద చెరువు సుమారు 800 పైచిలుకు ఎకరాలలో ఇందల్వాయి పెద్ద చెరువు ఉన్నప్పటికీ గ్రామంలోని చిన్న సన్నకారు రైతులకు కనీసం తినడానికి సైతం పంటలు పండే పరిస్థితి లేదని ఇందల్వాయి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు ఎరుకల ప్రసాద్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ప్రధాన కాలువలగుండా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి మంచినీరు రావడానికి ఇబ్బందిగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చిన్న సన్నకారు రైతులను దృష్టిలో పెట్టుకొని ఇందల్వాయి చెరువు నుండి పాస్తాగ వరకు సిమెంట్ కాలువను నిర్మించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా 14 గ్రామాలకు సంబంధించిన పెద్ద చెరువు ఉన్నప్పటికీ గ్రామంలోని చిన్న సన్నకారు రైతులకు సాగు నీరు అందక వ్యవసాయ పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని సర్పంచ్ పాలకవర్గ సభ్యులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేదని వాపోయారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి ఇందల్వాయి గ్రామ రైతులకు ఉపయోగపడే విధంగా సిమెంట్ కాలువలను నిర్మించాలని ఈ సందర్భంగా గ్రామ రైతులు ప్రజలు కోరుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మున్సిపల్ సమస్యలపై కలెక్టర్‌కు వైస్ చైర్‌పర్సన్ వినతి

- మున్సిపల్ ఆస్తుల అక్రమ విక్రయాలు, కబ్జాలపై ఫిర్యాదు.
- అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, కౌన్సిలర్లు.

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)



కామారెడ్డి మున్సిపాలిటీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వై.ఎన్. గిరికి కూడా వినతిపత్రం సమర్పించారు. గణపతి, దుర్గామాత నిమజ్జనాల అనంతరం మిగిలిన స్క్రాప్, విగ్రహాల స్టాండ్లు తదితర సామగ్రిని కౌన్సిల్ అనుమతి లేకుండా విక్రయించారని ఫిర్యాదు చేశారు. అశోక్‌నగర్ కాలనీలోని సర్వే నంబర్లు 218, 219లో ఉన్న మున్సిపల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని తొలగించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు.

ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపణ

వార్డుల్లో సమస్యలు పరిష్కరించడం లేదని, పండుగలకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని, కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. కమిషనర్ ఛాంబర్‌లోని సీసీ కెమెరాల వాయిస్ రికార్డింగ్, వాటి యాక్సెస్ దుర్వినియోగంపై ఆధారాలను కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈ అంశాలపై తక్షణమే మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.